"మీరు చూస్తూవుండండి బాబు గారూ, ఈ ఏడాది ముదురేసుకున్న తర్వాత మీ కౌలుపెకం అణాపైసలతో అప్పజెప్పేస్తాను" పైపంచెతో మొహం తుడుచుకున్నాడు, సుబ్బయ్య.

నేను చూస్తూవున్నాను.

సుబ్బయ్య వెళ్ళిపోయాడు.

నా మనస్సు వెనక్కు పరిగెత్తసాగింది.

—"నీ మొహం — నీకేం తెలీదు. నే చెప్పినట్టు విను."

అన్నయ్య గదమాయించాడు. తగలెయ్యటమేగానీ, కూటికొచ్చేనా, గుడ్డ కొచ్చేనా – ఈ చదువులు."

నేను గుటకలు మింగుతూ వుండి పోయాను.

—"ఎందుకోయ్, ఆ గునుపు? నీ బాగోగులు నాకు తెలీనివాయేం. నే చెప్పే మాట విను."

నేను అన్నయ్య చెప్పిన మాట విన్నాను. ఉద్యోగంలో చేరలేదు. జిల్లా పరిషత్తు గుమాస్తాగిరీకి చాలా మంది అభ్యర్థులు 'క్యూ'లో నిలబడే వున్నారు.

## ● విహారి & శాలివాహన

# మెత్తని పులులు

నేను అన్నయ్య చెప్పినట్టే విన్నాను. కాలేజీలో చేరలేదు. నా చదువు స్కూలు ఫైనల్‌దగ్గర ఫుల్‌స్టాప్ పెట్టుకుంది.

అమ్మ చాలా సంతోషించింది. "వందమైళ్ళ అవతల ఊరుకాని వూళ్లో నీకా చదువు ఎందుకు చిన్నా. అసలే వొంటూపిరి వాడివి" అని బుజ్జగించింది. అమ్మ ఆప్యాయత అలాంటిది.

వదిన పెరటి గుమ్మంలో నిలబడి నాకు వినపడేలా అన్నది, "చదువెందుకు– అని సామెత వుండనే వుంది. పట్నంలో జల్సాలకూ, కాలేజీఫీజులకూ డబ్బంతా

వదిన అన్నయ్యకు వంతపాడింది, "రెక్కలమ్ముకు బతికితే గానీ గడవని ఖర్మేం పట్టలేదుగా మనకు."

ఆ రాత్రి అమ్మకు చెప్పి చూశాను, "ఉద్యోగం పురుష లక్షణం అన్నారు. కనీసం సరదా కోసమైనా నన్ను ఉద్యోగంలో చేరనీయండి" అని.

నా సొదంతావిని అన్నది అమ్మ, "అన్నయ్యెందుకు చెప్తున్నాడో ఏమో. పెద్దవాడు. వాడి మాటవిను."

—'పిచ్చి పిచ్చి ప్రశ్నలు వెయ్యక నే చెప్పేది విను.

ఈ సంబంధం ఖాయం చేశాను. పిల్లని చూసొచ్చి తలవూపు,' అన్నయ్య హెచ్చరిక చేశాడు.

పిల్లను చూడకుండానే తలవూపేను నేను.

వదిన అన్నది. "ఉద్యోగం లేని వాళ్ళంతా పెళ్ళిళ్ళు చేసుకోమని భీష్మిం చుకు కూర్చుంటే —ఆడపిల్లల గతి అధోగతే, అయినా మరో పిల్లకి పెట్ట లేనంత దుస్థితేం లేదుగా మనకు."

మరో కోడలు వస్తుందని మురిసి పోయింది, అమ్మ. "జానకి సలక్షణ మైన పిల్ల. తెలివికి తెలివీ, అందానికి అందం, గుణానికి గుణం — అన్నీ వున్నై, ఆ యమ్మాయ్ నట్టింట్లో తిరి గితే చాలు - నువ్ నలభై ఉద్యోగాలు చేసినట్టు. ఒరేయ్, చిన్నోడా - అన్నయ్య చెప్పినట్టు విను."

అన్నయ్య చెప్పినట్టే విన్నాను నేను. వదిన ముసి ముసి నవ్వులు నవ్వు కుంది.

అమ్మ "మా చిన్నోడు మంచివాడు" అని సంతృప్తిగా మురిసిపోయింది. నాకు ఆ రాత్రి ప్రత్యేకంగా మీగడ పెరుగు పోసింది కూడా.

"మీకేం తెలీదు. మిమ్మల్నో వెర్రి బాగుల వాడిగా జమకట్టి, కొంపంతా గుల్ల చేస్తున్నారు. ఇవ్వాళ నన్ను ఆపకండి. నేను అడగదలచు కున్నవి నాలుగూ అడిగేస్తాను. మీరు చూస్తూ వూరుకోండి" జానకి నా చెవులో యిల్లు కట్టు క్కూర్చుంది.

నేను చూస్తూ ఊరుకున్నాను.

"మిగిలిందది. ఇందులో నేనుగాని చేసిందేంవుంది" ఆస్తి విషయం ప్రస్తా విస్తూ అన్నాడు అన్నయ్య.

జానకి మొదలెట్టింది. "అవును, మిగిలిందదే మీరు పాతికేళ్ళ నుంచీ - క్రమంగా స్వాహా చేస్తుంటేనే గదా బారెడు చెక్కకాస్తా మూరెడు ముక్కైక్క ఇవాళకి చారెడు మిగిలింది."

"అవున్లే అమ్మా. మీ ఆ సంతాకూడా మేమే తిన్నామ్" వదిన పుల్ల విరుపు మాట.

జానకి మరీ రెచ్చి పోయింది. "తిన్నారో లేదో ఎవరి మనసుకు వాళ్ళకు తెలీదాయేం."

"వాడికి తెలీకుండా నేను చేసిన వ్యవహారాలేవీ లేవు." అన్నయ్య.

"అవును. ఏవీ లేవు. ముగ్గురాడ పిల్లల పెళ్ళిళ్ళు; ఇద్దరు కొడుకుల చదువూ - అన్నీ ఆయనకు తెలుసు. తెలిసీ అన్నింటికీ చంకలు కొట్టుకొంటూ కూర్చుంటే-సంబరపడ్డారు. మా తమ్ముడు మంచివాడు; మా మరిది మంచివాడు అంటూ వోహ్ బిరుదులు పారేసి ఉబ్బేసి కూర్చోబెట్టారు."

"అనవసరపు మాట లెందుకండీ. ఆవిడ గలభా ఎందుకు, లెక్కలు తేల్చు కొంటే సరి." అన్నయ్యకు సలహా ఇచ్చింది వదిన.

"సరే, ఇంతదాకా వచ్చింది కనుక చెప్తున్నాను. లెఖ్ఖలు తేల్చదలచుకొంటే మొదట్నుంచీ రండి. రమ,పద్మ,సరోజ- పెళ్ళిళ్ళు ముప్ఫైవేలు; వాసు ఎం. ఏ; రాజు ఎంకామ్ ఎల్ఎల్బీ- మరో ఇరవై వేలు-ఇవన్నీ పాతరేట్లు" జానకి గణితం మొదలెట్టింది.

జానకి మాటతీరుకు అన్నయ్య విస్తు

పోయి కూర్చున్నాడు. జానకి మాట్లాడే ఒక్కొక్క వాక్యమూ కందిరీగ కుట్టినట్టు కుడుతోంది కాబోలుమరి।

పరిస్థితి విషమిస్తోందని గ్రహించాడు కాబోలు - వెంకటాద్రి మధ్యవర్తిగా ముందుకొచ్చాడు. ఆయన అన్నయ్యకు బావమరిది వరస.

ఆయన అన్నాడు, "చూడు మూర్తీ. మీ అమ్మా నాన్నలు వుండగా జరిగిందేదో జరిగింది. సమిష్టిగా నలుగురూ అనుభవించారు, నలుగురూ ఆనందించారు. అవన్నీ గడచిపోయిన సంగతులు."

కొద్దిసేపు నిశ్శబ్దం ఆవరించింది. ఆపైన ఆయన ఏం చెబుతాడో నన్నట్టు అంతా ఎదురుచూడసాగేరు. ఆయన ఏవీ మాట్లాడలేదు.

క్షణాల తర్వాత జానకే అన్నది, వెంకటాద్రి నుద్దేశించి - "అట్లాగెతే మిగిలిన ఆస్తిలో వాళ్ళకేఁవీ పోవటానికి వీల్లేదు. న్యాయమేగదా।"

వెంకటాద్రి అదోలా జానకివైపు చూశాడు. ఆ వెంటనే నా కళ్ళల్లోకి సూటిగా, పరీక్షగా చూశాడు. 'పెళ్ళాం చేత మాట్లాడించటఁవే తప్ప నువ్వేమీ అనలేని చవటవా?' అని అడుగుతున్నట్లున్నయ్ ఆయన చూపులు. నేనెన్ని అర్థాలు చదువుకోగలిగినా, నా నిశ్చయం మారలేదు. నేనా లంపటంలోకి దిగదలచుకోలేదు.

చూస్తూ ఊరుకున్నాను.

"ఉన్నపళాన వాణ్ణి నెత్తిన కండువా వేసుకుపొమ్మనటం నీకు జయంకాదురా మూర్తీ?" అన్నాడు వెంకటాద్రి.

జానకి ఉక్రోషంగా ఆయనవైపు చూసింది.

"దీన్ని మధ్యవర్తిత్వం అనరు" అంటూ విసురుగా అక్కణ్ణుంచి వెళ్ళిపోయింది.

జానకి వెళ్ళిన తర్వాత అన్నయ్యకు మాట పెగిలింది. "ఇల్లు నేను తీసుకుంటాను, తూర్పు పొలం రెండెకరాలూ నా కివ్వు. పడమర నున్న పదెకరాలూ నువ్ తీసుకో."

"ఎందుకనీ - మెరక చేను మా మొహాన్నకొట్టి పల్లం కాస్తా మీరు తీసుకోవాలా. ఆ పదెకరాల్లోనూ పండేది ఇంచక్కని గులకరాళ్ళేగా. తెలివంటే మీదే బావగారూ." లోపల్నుంచే అంది జానకి.

"అమ్మో ఏం దూకుడు।" అని బుగ్గలు నొక్కుకుంది వదిన.

నాకు నవ్వొచ్చింది. కాని, నవ్వలేదు.

"గంగిగోవు పాలు పద్యం మాకూ వచ్చు."అని జానకి ఇంకా ఏదో అంటూ దొడ్లోకి వెళ్ళినట్లుంది.

కొద్దిసేపు గంభీరమైన నిశ్శబ్దం తర్వాత అన్నయ్యే అడిగేడు, "ఏరా చిన్నోడా - ఏమంటావ్?" అని.

నేను ఏమీ అనలేదు. తలొంచుకుని యివతలికి వచ్చేశాను

పడగ్గదిలో జానకి అంది, "తెగేదాకా లాగితే ఏడుస్తారని ఊరుకున్నాను. నష్టపోయిన వాళ్ళం ఎటూ నష్టపోయాం, నలుగురిచేతా నానా మాటలూ ఎందుకులెండి. పోనీండి. పెద్ద పెద్ద ఉద్యోగాల్లో వున్న కొడుకులు, అల్లుళ్ళు - వరి పండే పొలం- వాళ్ళనే సుఖపడనీండి. అయినా

బెల్లం కొట్టిన రాయిలా అన్నిటికీ మీరలా తలొంచుకు కూర్చుంటుంటే - నేనుగా ఎంతదాకా వాగేది?"

జానకి నా తత్వాన్ని బాగా చదివేసిన పిల్ల. నా తరహాని అసమర్థత అనుకోదు.

జానకి స్వభావం నాకూ తెలియనిది కాదు. ఆవేశంలో ఏవేవో అరిచేసి ఆనక, 'పోనీలెద్దురూ' అనుకునే మనస్సు ఆమెది.

"నా నెత్తిన కాళ్ళు తియ్యరా నాయనా. తన్నే రోజులు ముందున్నయ్." అని విశ్వాన్ని పక్కకి జరిపి, తను అటు వైపు తిరిగింది, "వీళ్ళిలా పెరిగి పెద్ద వాళ్ళవుతారో ఏమో, వీళ్ళన్నా బాగా చదువుకుని పైకొస్తే - నా కలలన్నీ ఫలిస్తయ్."

జానకి ఆశలన్నీ విశ్వం, చంద్రం మీదే వున్నయ్, వాళ్ళు నాలా కాకూడదనే కోరిక కాబోలు!

అవును. చదువు గురించి నేనూ చాలా కలలు గన్నాను. పేరు చివరడిగ్రీ అక్షరాలు తగిలించుకోవాలని నాకూ ఎంతో ఆశగా వుండేది, కాని ఆ ఆశ ఫలించలేదు. అన్నయ్య మాట విన్నాను మరి.

వాసు సెలవులకి ఇంటికొచ్చినప్పుడల్లా ఎన్నెన్నో కాలేజీ కబుర్లు చెప్తూవుండే వాడు. నాలుగేళ్లూ ఇట్టే గడిచిపోయినై. వాడు యూనివర్శిటీలో చేరాడు. చూస్తుండగానే ఎమ్మే అయిపోయాడు. ఆ తర్వాత, రాజు - సాగర్ దాకా వెళ్ళి ఎం. కాం. యల్. యల్‌బి పుచ్చుకొచ్చేడు.

"చివరికి ఆ గులకరాళ్ళ గుట్టలే గతి అన్నమాట మనకు"— జానకి యధాలాపంగా అన్నది.

"శనక్కాయా, పొగాకూ వేస్తున్నాం ట్టలే. రేపోమాపో సాగర్ నీళ్ళొస్తయంటున్నారు. పొలమంతా పల్లం చేసుకోవచ్చులే" అన్నాను.

"ఆ.... అవన్నీ ఏనాటి మాటలో" అంటూ నిట్టూర్చింది జానకి.

ఆ మర్నాడు.

కుంపట్లు వేరయినై.

మా మకాం మారింది.

ఇంటిని బావమరిదికి యిచ్చుకుని పట్నం చేరారు, అన్నయ్యా వదినా వాళ్ళు.


అప్పట్నుంచీ ఇదే వరస—

ప్రతి యేడాదీ నేను ఈ రోజుల్లో సుబ్బయ్య ఇంటి చుట్టూ ప్రదక్షిణలు చేయటం, లేదా అతన్ని మా యింటికి పిలిపించి కూర్చోబెట్టటం.

"నావల్ల కాదండి. ఈఏడు పైసా చేతికి రాలేదు, మీకు తెలియనిదేముంది" అంటూ ఇక్కట్ల దండకం చదవటం మామూలుగా మారింది సుబ్బయ్యకు. చేను మాత్రం ఖాళీగా వుండేదికాదు. పొగాకో, వేరుశనగో వేసేవాడు. పండినంత పండేది.

సుబ్బయ్య మొండి చెయ్యి చూపుతూ వుండటంతో విసుగెత్తి, "పోనీ, చేను వదిలెయ్యవోయ్, మరొకళ్ళకి ఇచ్చుకుంటాము" అనే వాళ్ళం, నేనూ, జానకీ.

"వీల్లేదు. నా కంఠంలో ప్రాణముండగా మరొకడు చేలో కాలు పెట్టేందుకు వీల్లేద"ని మీసం మెలివేసే వాడు




సుబ్బయ్యా మరో కొద్ది సేపటికి, "ఈ యేడాదికి దయ సూపండి బాబుగారూ" అని చేతులు నలుపుకుంటూ కూర్చునే వాడు సుబ్బయ్య.

నేను అలాగే ద య సూ పు తూ నే వున్నాను.

—పదేళ్ళు గిర్రున తిరిగినై.

ఈ పదేళ్ళలోనూ అప్పు పెరిగింది— పిల్లలతోపాటూ! వాళ్ళ వయసులతో విశ్వం, చంద్రం హైస్కూల్లో కొచ్చారు. సావిత్రి, బుజ్జి కొత్త సభ్యులయ్యేరు.

వెంకటాద్రి అన్నయ్య పొలానికి సంరక్షకుడుగా వుంటి, రెండెకరాల్ని నాలుగెకరాలు చేశాడు!

"ఈ పొలం వ్యవహారంతో ప్రాణం కడబట్టిపోతోంది. ఈ ఏడాది అటో యిటో తేల్చుకోవాల్సిందే" అని పంతం బట్టింది జానకి.

"ఏం తేల్చుకోవటమో – సుబ్బయ్య మొహం చూస్తుంటే జాలేస్తోంది జానకీ" అన్నాడు.

జానకి అదోలా పక్కకి తిరిగి, ఆ వెంటనే ముందుకు నడుస్తూ నా దగ్గిరగా వచ్చింది.

ఆమె కళ్ళనిండా నీళ్ళు తొణికిసలాడుతున్నై. ఈ హఠాత్ చర్యకు నేను అప్రతిభుణ్ణయ్యాను.

"నా మొహం చూ స్తుంటే ఏం వేస్తోంది"—మేఘం వర్షించనే వర్షించింది. జానకి కంఠం డుద్దమైంది.

నా మనస్సు ఆర్ద్రమైంది. "ఏమిటిది పిచ్చిమొద్దు ఊరుకో." అంటూ ఆమె భుజం తట్టాను. క్షణాలు గడిచాయి.

చెంగుతో కళ్ళుతుడుచుకుని అన్నది జానకి. "మీరు సుబ్బయ్య మొహం చూడకండి. నేను మాట్లాడతాను."

నేను మళ్ళీ సు బ్బ య్య తో ఈ విషయం ప్రస్తావించలేదు.

జానకి పొలం బేరంపెట్టింది, "వీలైతే తనే తీసుకుంటానన్నాడు సుబ్బయ్య. పదిరోజుల్లో చెప్తాడుట ఈలోగా నలుగురికీ చెప్పమన్నాను." అంది.

నేను ఆశ్చర్యపోయాను—కౌలు డబ్బు ఇవ్వలేనని మొరాయిస్తున్న సుబ్బయ్య

తానే పొలం బేరం గురించి ఆలోచించ టమేమిటా అని. ఆ మాటే అన్నాను జానకితో.

'తన చుట్టానికెవరికో కావాలట, తన కంటే స్వయానా తనకు కాదుట లెండి' అంది.

ఆ రాత్రి ,

బాదంచెట్టు క్రింద నులకమంచంమీద పడుకుని ఆకాశం కేసి చూస్తున్నాను, పొలం పోతోందంటే బాధకలిగింది,

"అయితే ఆ కాస్త చెక్కకి కూడా కాలం తీరిందన్న మాట"—అన్నాను.

"ఉన్నదని చెప్పుకోడానికి తప్ప ఎందుకూ ఉపయోగం లేని ఆ చెక్కకి కాలం తీరటమే మేలు. డబ్బూ ఇవ్వదు, పొలమూ వదలదు. ఏంవిటీ అవస్థ. అవతల అప్పు చూడబోతే కొండలా పెరిగి పోతోంది, ఆ కాస్తా అమ్మేసి వచ్చే నాలుగు రాళ్లూ అప్పు తీరిస్తే ఆనక తిన్నా, పస్తులున్నా అడిగే వాళ్ళుందరు" జానకి చెప్పుకు పోతోంది.

నేను ప్రక్కకి తిరిగేను.

ఉమ్మడి కుటుంబంలో చిన్నవాణ్ణిగా వుండి, ఎవరేం చెప్పే అలా ఊం కొట్టి ఊరుకున్నందుకు ఫలితం అనుభవించక తప్పదనిపించింది. తూర్పుపొలం వదులుకొని, అన్నయ్య చేస్తున్న పనులన్నింటికీ ఉదాసీనంగా ఊరుకున్నందుకు మంచి పర్యవసానమే రుచి చూశాను

పొలం బేరానికి పెట్టి రెండు నెలలైంది.

సుబ్బయ్య తరపు చుట్టం తనకఖ్ఖర్లేదన్నాడని చెప్పేడు సుబ్బయ్య.

పొలం కొనటానికి ఎవరూ ముందుకు రావటం లేదు. ఒకరో ఇద్దరో వచ్చినా, ధర అడగడం — 'పంటని పొలం ఎంతకుకొన్న దండగే' అని వెళ్ళిపోవటం జరుగుతూంది.

'ఎకరం మూడు వేలంటే బేరం రాదేమో జానకీ' అన్నాను ఒకరోజు. చాలాసేపు ఆలోచించి, "సరే కానీయండి ఈ సారి అడిగిన వాళ్ళకు తగ్గించి చెబుదాం" అని "దేవుడు వరమిచ్చినా పూజారి వరమివ్వడు. అన్నట్లుండి వ్యవహారం. పదేళ్ళ నుంచీ పొలం వదలని సుబ్బయ్య తీరా అమ్ముకోమన్నా కొనే వాళ్ళురావటంలేదు" అంది, నిరుత్సాహంగా ఒకరోజు.

సుబ్బయ్య మా యింటికొచ్చాడు. ఎకరం పదిహేను వందలైతే బేరంకుదిరే అవకాశం వుందని సూచించాడు.

ఆ రోజు సాయంత్రానికి.

అదే రేటుతో బేరం ఖరారయింది.

బజానా యిచ్చి వెళ్ళిపోయాడు సుబ్బయ్య.

నాలుగురోజుల తర్వాత రిజిస్ట్రేషన్ తేదీ నిర్ణయించుకొన్నాం—

మర్నాడు రిజిస్ట్రేషన్ అనగా ఈవేళ రాత్రి—

దస్తావేజులు రాయించుకొచ్చాడు సుబ్బయ్య.

కొన్నవారి పేరుచూసి తృళ్ళిపడ్డాను—

వదిన పేరు !

ఆయేడు పొలంలో పేరుకెనగ వేశాడు సుబ్బయ్య.

అవును—సుబ్బయ్యే కౌలుదారు !

పట్నంలో మేడకట్టించిన అన్నయ్య; పల్లెటూళ్లో ట్రాక్టర్ తెప్పించిన వెంకటాద్రీ—కళ్ళముందు మెదిలేరు !!

●